క్లుప్తంగా

నవమి ఉత్సవాలు ప్రారంభం



కె.జె.పురంలో భక్తులు నగర సంకీర్తన చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: ఉగాది పర్వదినాన రామాలయాల్లో శ్రీరామ నవమి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 17న శ్రీరామ నవమి సందర్భంగా కె.జె.పురం సీతా రామస్వామి ఆలయంలో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. భక్తులు నగర సంకీర్తన, అనంతరం స్వామివారి కలశ పూజ నిర్వహించారు. వంటర్లపాలెం, ముకుందపురం, వీరవల్లి, తదితర గ్రామాల రామాలయాల్లో ఉత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఘనంగా నూకాలమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: స్థానిక పప్పులవారి కళ్లాల వద్ద మంగళవారం నూకాలమ్మ ఆలయ ఐదో వార్షికోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఇక్కడ వేకువజాము నుంచి మహిళలు ఆలయానికి పెద్ద ఎత్తున వచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కొండపాలెం, వెలంకాయల పాలెం తదితర గ్రామాల నుంచి భక్తులు వచ్చి ప్రసాదం స్వీకరించారు.

వైభవంగా నూకాంబిక పండగ



దాలింపేటలో ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

మాకవరపాలెం: నూకాంబిక పండగను దాలింపేటలో వైభవంగా నిర్వహించారు. ఏటా ఉగాది రోజున ఇక్కడ అమ్మవారి పండగ నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. స్థానికులే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు తప్పనిసరి



తహసీల్దార్ రమేష్‌కుమార్

నాతవరం: ఎన్నికలు కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల నాయకలు నిబంధనలు విధిగా పాటించాలని తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. మండలంలో 51 వేల మంది ఓటర్లు ఉన్నారన్నారు. 65 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నా రు. ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు గ్రామాల్లో ముందస్తుగా 900 మందికి పైగా బైండోవర్ చేశామన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో ఇప్పట్నుంచే ప్రత్యేకంగా పోలీసు నిఘా ఉంచామన్నారు. రెండు జిల్లాల సరిహద్దు గన్నవరం మెట్ట వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ వాహనాల తనిఖీలు ముమ్మరం చేశామన్నారు.

చెరకు కార్శి తోట దగ్ధం



రైతును పరామర్శించి ఘటనపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ, తదితరులు

మాడుగుల: నియోజకవర్గ కేంద్రం మాడుగులలో సోమవారం రాత్రి పాలగెడ్డ రిజర్వాయర్ దిగువన, బొడ్డేడ శ్రీనుకు చెందిన చెరకు కార్శి తోట విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ మంగళవారం బాధిత రైతును పరామర్శించారు. నష్టపోయిన రైతును ఆదుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. సన్న, చిన్నకారు రైతులకు అండగా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, ఎంపీటీసీ పాలిమేర విజయలక్ష్మి, పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు పాలిమేర చిన్నారావు, సయ్యపురెడ్డి సత్తిబాబు, సమ్మంగి జగన్ పాల్గొన్నారు.



నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్‌ను పూలమాలతో సత్కరిస్తున్న పార్టీ నాయకులు



కొత్తకోట శివకేశవ ఆలయంలో పంచాంగ శ్రవణం



రోలుగుంట రామాలయంలో పంచాగం వినిపిస్తున్న అర్చకుడు లక్ష్మీ నారాయణమూర్తి



ఎం. కోడూరు శివాలయంలో సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

క్రోధిని జయించుగాక

- నందడిగా ఉగాది సంబరాలు
- వాడవాడలా పంచాంగ శ్రవణం

తెలుగు లోగిలి సందడి చేసింది. మామిడాకుల తోరణాలు, రంగవల్లికలతో కళకళలాడింది. చిన్నారుల నుంచి పెద్దల వరకు సంప్రదాయ దుస్తుల్లో మెరవగా, లంగా ఓణీలో యువతులు హొయలు పోయారు. ఇంటింటా షడ్రుచుల సమ్మేళనంతో తయారైన ఉగాది పచ్చడి రుచి చూశారు. క్రోధి నామ వత్సరాది సందర్భంగా ఆలయాల్లో పంచాగ శ్రవణం చేశారు.

నర్సీపట్నం: ఉగాది వేడుకలను ప్రజలంతా ఘనంగా జరుపుకున్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి పంచాగం తెలుసుకున్నారు. సంప్రదాయ దుస్తుల్లో ఎమ్మెల్యే గణేష్, కళావతి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ పట్టణాధ్యక్షుడు ఏకా శివ, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఉన్నీషా బేగం, కౌన్సిలర్లు వీరమాచినేని, జగదీశ్వరి, కర్రి చైతన్య, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, కె.వరలక్ష్మి, దేవత అరుణ, పార్టీ నాయకులు, మహిళలు ఉగాది శుభాకాంక్షలు తెలియజేసి, ఎమ్మెల్యే దంపతులను పూలమాలలతో సత్కరించారు.

చోడవరం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదిదేవుడైన స్వయంభూ విఘ్నేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మంగళవారం ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఇక్కడ పంచాంగ శ్రవణాన్ని పంచాంగ జ్యోతిష్యుడు గౌరీశంకర శాస్త్రి అందరికీ తెలియజేశారు. స్వయంభూ గౌరీశ్వరస్వామివారి, కేశవస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూకాంబిక ఆలయంలో ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు.

రావికమతం: ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం గ్రామ గ్రామాన పంచాంగ శ్రవణ కార్యక్రమాలు నిర్వహించారు. రావికమతం శివాలయం, చినపాచిల పెద్దరాయి వద్ద, కొత్తకోట శివకేశవ ఆలయం, టి.అర్జాపురం వినాయక ఆలయం, గొంప, మరుపాక, తదితర గ్రామాల్లోని రామాలయాల్లో సందడిగా పంచాంగ శ్రవణాన్ని పండితులు చెప్పారు.

రోలుగుంట: మండలంలో అన్ని గ్రామాల్లోను ఉగాది వేడుకగా నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక పాత రామమందిరం వద్ద అర్చకుడు వేపా లక్ష్మీనారాయణమూర్తి పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఏడాది రెండు కుంచాలు వర్షం పడుతుందన్నారు. నల్ల పంటలకు డిమాండు ఉంటుందన్నారు. అన్ని వృత్తుల వారికి సామాన్యంగా ఉంటుందన్నారు.



రావికమతం: చినపాచిలలో పండితుడు వాసుదేవరావు పంచాంగ శ్రవణం

చీడికాడ: ఉగాది సందర్భంగా గ్రామ గ్రామాన పంచాంగ శ్రవణ కార్యక్రమాలు జరిగాయి. తెలుగు వత్సరాది కావడంతో పిన్నలు, పెద్దలు ఉగాది పచ్చడి రుచి చూశారు. పంచాంగ శ్రవణంలో పాల్గొని రాశిఫలాలు తెలుసుకున్నారు.

మాకవరపాలెం: ఉగాది పండగను అన్ని గ్రామాల ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. రామాలయాల్లో నిర్వహించిన ప్రచాంగ శ్రవణం కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: క్రోధి నామ సంవత్సరం పురస్కరించుకుని అన్ని ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎం. కోడూరు కాశీవిశ్వేశ్వర స్వామి, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు, కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజల తదనంతరం ఉగాది పచ్చడి పంచిపెట్టారు.

నాతవరం: మండలంలో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. నాతవరం రామాలయంలో ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యురాలు కరక రేణుక ఆధ్వర్యంలో పండితులతో పంచాంగ శ్రవణం చెప్పించారు. అనంతరం ఉగాది పచ్చడి రుచి చూశారు. పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు పైల పోతురాజు, మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



చోడవరంలో స్వయంభూ విఘ్నేశ్వరస్వామి



దేవరాపల్లి రామాలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామ పెద్దలు, ప్రజలు

కె.కోటపాడు: క్రోధి నామ సంవత్సరం సందర్భంగా ప్రజలు పరస్పర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. గొండుపాలెం, రొంగలినాయుడుపాలెం, గుల్లేపల్లి, పాచిలవానిపాలెం, పైడంపేట, కె.కోటపాడు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో అర్చకులు పంచాంగ శ్రవణం చెప్పారు. సర్పంచ్‌లు పైల పైడితల్లమ్మ, బండారు దేముళ్లు, తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో క్రోధి నామ సంవత్సరం సందర్భంగా పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. దేవరాపల్లి రామాలయంలో అర్చకుడు లక్ష్మీపతి పంచాంగం వినిపించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో అభయాంజనేయ స్వామి భారీ విగ్రహం నిర్మాణానికి గ్రామస్తులు విరాళాలను గ్రామ పెద్దలకు అందజేశారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వరదపురెడ్డి లలితానాయుడు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, గండిపడాల అప్పలరాజు, గుండు రాంబాబు, గొర్లె సన్యాసినాయుడు, ఇట్లా వెంకట పతి తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మాడుగుల పార్థసారథి ఆలయంలో తిరువీధి ఉత్సవాలు



రొంగలినాయుడుపాలెంలో...

మాడుగుల: తెలుగు పండుగ అలనాటి సంప్రదాయం ప్రకారం నిర్వహించారు. గ్రామ గ్రామాన పంచాంగ శ్రవణం నిర్వహించారు. తెల్లవారే మహిళా రైతులు పొలాల్లో పశువులు గెత్తం వేసి పనులు ప్రారంభించారు. ఉదయం నుంచి ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ, పార్థసారథి, వేంకటేశ్వర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



చోడవరం వినాయక ఆలయంలో భక్తులు



నాతవరంలో పంచాంగ శ్రవణం

క్రోధి నామ సంవత్సరంలో విజయాలు సిద్ధించాలి



డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును సత్కరించి మద్దతు ప్రకటిస్తున్న సబ్బవరం మండల నాయకులు

అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: క్రోధి నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు అన్ని శుభాలు జరిగి, విజయాలు సిద్ధించాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లా, రాష్ట్ర ప్రజలకు ఆయన ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన పలువురు నాయకులు మంగళవారం తారువలో డిప్యూటీ సీఎంను కలిసి ఘనంగా సత్కరించి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. అనకాపల్లికి చెందిన రాష్ట్ర బీసీ వెల్ఫేర్ ప్రెసిడెంట్ కాంండ్రేగుల చంద్, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు, బీసీ విభాగం ప్రెసిడెంట్ కాంండ్రేగుల జగన్, బొడ్డేడ బుజ్జి, కాంండ్రేగుల ప్రకాష్, సబ్బవరం మండలానికి చెందిన బీఎస్ నాయుడు నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు కలిసి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీగా గెలిపించేందుకు తామంతా కష్టపడి పనిచేస్తామని స్పష్టం చేశారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరాదిలో అష్టైశ్వర్యాలతో తుల తూగాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు.

రావికమతం టూ కవగుంట రయ్‌రయ్!



మంగళవారం నాటికి పూర్తయిన తారురోడ్డు

రూ.2 కోట్లతో తారురోడ్డు నిర్మాణం పూర్తి

రావికమతం: గత టీడీపీ నాయకులు కాసుల కక్కుర్తితో చోడవరం నియోజకవర్గంలో రోడ్లను గ్రానైట్ లారీలతో పూర్తిగా విధ్వంసం చేయడమేగాక వాటిని పట్టించుకున్న పాపానపోలేదు. పర్యవసానంగా వందలాది మంది వాహనదారులు సరైన రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చొరవతో మండలంలో నిత్యం రద్దీగా ఉండే రావికమతం–కింతలి తారురోడ్డు నిర్మాణం మంగళవారం నాటికి పూర్తయ్యింది. దాంతో ఈ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రావికమతం, మాడుగుల మండలాల్లో 26 గ్రామాలకు కీలకమైన ఈ రహదారిలో గతంలో గ్రానైట్ లారీల రాకపోకలతో పూర్తిగా ధ్వంసమైంది. పలు చోట్ల పెద్ద గోతులు పడి ఉండేవి. ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడేవారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వచ్చిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీకి రహదారి సమస్య పరిష్కరించాలని విన్నవించారు. దాంతో ఆయన రూ.2 కోట్లు మంజూరు చేయించారు. ఈ మొత్తంతో రావికమతం నుంచి మండల శివారు గ్రామం కవగుంట వరకు చక్కని తారురోడ్డు నిర్మాణం పూర్తయింది. గ్రామస్తులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ బైక్‌లపై కలియతిరిగారు.



గతంలో పాడైన తారురోడ్డు(ఫైల్)

ఘనంగా ఆంజనేయ స్వామి తీర్థం

మాడుగుల: సత్యవరంలో మంగళవారం అంగరంగ వైభవంగా ఆంజనేయస్వామి తీర్థం జరిగింది. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. గ్రామంతోపాటు ఇతర గ్రామాల వారు పాల్గొన్నారు.

కాసులు కురిపిస్తున్న పుచ్చపంట

- కొండకొడాబులో 8 ఎకరాల్లో పంట
- ఇప్పటి వరకు 140 టన్నుల విక్రయం



కొండకొడాబులో విస్తారంగా సాగు చేసిన పుచ్చకాయ పంట



12 కేజీల పుచ్చకాయను చూపిస్తున్న రైతు కృష్ణారావు

దేవరాపల్లి: గిరిజన ప్రాంతంలో సంప్రదాయ పంటలకు భిన్నంగా వేసిన పుచ్చపంట ఇప్పుడు కాసుల వర్షం కురిపిస్తోంది. తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం రావడంతో గిరిజన రైతులు ఈ సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. దాంతో తామరబ్బ పంచాయతీ కొండకొడాబులో విస్తారంగా సాగు చేశారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రతి ఒక్కరూ పుచ్చకాయ తినాల్సి వస్తోంది. దీంతోపాటు పోషకాలు పుష్కలంగా ఉండటంతో మార్కెట్లో వీటికి మంచి డిమాండ్ ఏర్పడింది. కొండకొడాబు రైతు ఏపీ కృష్ణారావు ఎనిమిది ఎకరాల్లో సాగు చేయగా, ఇప్పటి వరకు 140 టన్నులు దిగుబడి వచ్చింది. మరో 15 టన్నులు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఇక్కడి కాయలు సైజు పెద్దవిగా రుచిగా ఉండటంతో విశాఖపట్నం వ్యాపారులు నేరుగా వచ్చి కొనుగోలు చేస్తున్నారు. టన్ను రూ.11 వేల నుంచి రూ.12 వరకు వరకు అమ్ముడుపోతున్నాయి. ఒక్కొక్క పుచ్చకాయ 8 నుంచి 10 కేజీల ఉంటోంది. రబీలో నీటి వసతి ఉన్న రైతులు పుచ్చ సాగు చేసుకుకోవచ్చునని, 90–100 రోజుల మధ్య పంట దిగుబడికి వస్తుందని రైతు కృష్ణారావు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి సంపూర్ణ మద్దతు

యడ్లవానిపాలెం ఎన్నికల ప్రచారంలో అనురాధకు ఘన స్వాగతం

కె.కోటపాడు: వైఎస్సార్‌సీపీ పాలనలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో తమ గ్రామాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేశారని యడ్లవానిపాలెం గ్రామ పెద్దలు గనివాడ సత్యం, యడ్ల సన్నిబాబు, యడ్ల వెంకటేశ్వరమ్మ తెలిపారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. పెద్దలు, మహిళలు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. గ్రామంలో అంతర్గత సీసీరోడ్లు, సిరికివానిపాలెం–యడ్లవానిపాలెం మధ్య అంతర్గత రోడ్డు, కమ్యూనిటీ భవనం నిర్మించారని సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య, వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి అన్నారు. మంచి చేసిన సీఎం జగన్, డిప్యూటీ సీఎం బూడికి కృతజ్ఞతగా గ్రామస్తులమంతా ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు అనురాధ, బూడి ముత్యాలనాయుడులకు మద్దతుగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేస్తామని ముక్తకంఠంతో ప్రకటించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో లంచాలు, వివక్ష అన్న మాట లేకుండా ప్రజలకు మేలు చేశారన్నారు. మహిళా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చిన జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, లెక్కల గోపి, బొడ్డు దొరస్వామినాయుడు, యడ్ల సత్తిబాబు, లెక్కల నాయుడుబాబు, యడ్ల వెంకునాయుడు, లెక్కల వెంకటరమణ, సత్తిబాబు పాల్గొన్నారు.



యడ్లవానిపాలెంలో అనురాధకు సంపూర్ణంగా మద్దతు ప్రకటించిన మహిళలు, గ్రామపెద్దలు

ఉపాధి పనుల వద్ద అదనపు సౌకర్యాలు

పలు గ్రామాల్లో పరిశీలించిన ఎంపీడీవో, ఏపీవో



దొండపూడిలో పందిరిని పరిశీలిస్తున్న అధికారులు



మత్సవానిపాలెంలో కూలీలకు మెడికల్ కిట్ అందిస్తున్న ఎంపీడీవో భానోజీరావు, ఏపీవో

రావికమతం: ఎండలు పెరుగుతున్న దృష్ట్యా ఉపాధి హామీ పనుల వద్ద విధిగా తాటికమ్మల పందిరి ఏర్పాటు చేయాలని, ప్రథమ చికిత్సకు సంబంధించి మెడికల్ కిట్ అందుబాటులో ఉండాలని ఎంపీడీవో భానోజీరావు, ఏపీవో దాడి వెంకటకాశి అప్పారావు తెలిపారు. వీరు మంగళవారం పలు గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. మండలంలో ఈ ఏడాది రూ.18 కోట్ల విలువ గల 832 పనులు చేపడుతున్నామన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా విధిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి పని వద్ద తాటి కమ్మల పందిరి, తాగునీరు ఉంచాలని ఆదేశించారు. ఈ మేరకు ఆయా సౌకర్యాలు ఉన్నాయా లేదా పరిశీలించారు. మత్సవానిపాలెం వద్ద మెడికల్ కిట్ లేకపోవడంతో తక్షణమే పీహెచ్‌సీ వైద్యాధికారితో సంప్రదించి అక్కడి జాబ్‌కార్డు దారులకు అందించారు. ప్రతి ఒక్కరికీ రూ.300 కూలి గిట్టుబాటయ్యేలా పనులు చేపట్టాలని వీఆర్పీలకు సూచించారు. వడదెబ్బ తగలకుండా ఉదయం 5 గంటలకు సాయంత్రం ఎండ తగ్గిన తర్వాత పనులు చేపట్టాలని ఆదేశించారు.

చిరస్మరణీయుడు చంద్ర రాజేశ్వరరావు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ అగ్రనేత చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజాన దొరబాబు పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ నేతలు నరాలశెట్టి సత్యనారాయణ, సాయిలక్ష్మణ్, కోరిబిల్లి శంకర్‌రావు, సతీష్, కోన లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.